క్లుప్తంగా

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.లక్ష విరాళం



దాత కుటుంబానికి విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఒక భక్తుడు ఆదివారం రూ.లక్ష విరాళంగా అందజేశారు. గన్నవరం మండలం కేసరపల్లికి చెందిన జాస్తి మధు కల్యాణ్ ముందుగా కుటుంబ సభ్యులతో కలసి స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమచేశారు. దాత కుటుంబానికి ఆలయ సూపరింటెండెంట్ మద్దాల శ్రీను విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

ఆర్థిక సహాయం అందజేత



భోగోలులో బాధిత కుటుంబానికి సహాయం అందజేస్తున్న సంస్థ సభ్యులు

లింగపాలెం: శ్రీసాయి హెల్పింగ్ హెండ్స్ సంస్థ సభ్యులు ఆదివారం ఓ బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. భోగోలు గ్రామానికి చెందిన తాడేపల్లి దయరాజు కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. పేదరికంతో ఇబ్బందులు పడుతున్న దయరాజుకి డయాలసిస్ చేయించేందుకు అతని కుమార్తె సృజనకు శ్రీసాయి హెల్పింగ్ హేండ్స్ సంస్థ సభ్యులు సీహెచ్ సాల్మన్‌రాజు ఆధ్వర్యంలో రూ.10 వేల నగదును అందజేశారు. సంస్థ సభ్యులు సాల్మన్ రాజు, డీకేఎస్ఎస్ ప్రకాశరావు, ఈ శ్రీను, సురేష్‌బాబు, జి.మోహనరావు, జి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

శబరిమలకు వెళ్లిన అయ్యప్పస్వాములు



శబరిమలకు వెళ్లిన స్వాములు

బుట్టాయగూడెం: మండలంలోని రెడ్డిగణపవరంలో సుమారు 42 రోజులపాటు స్వామి అయ్యప్ప దీక్షను పూర్తిచేసిన స్వాములు ఆదివారం ఇరుముడి కట్టి శబరిమలైకు బయల్దేరి వెళ్లారు. ఎంతో భక్తి శ్రద్ధలతో స్వామి అయ్యప్ప శరణం నామస్మరణం చేస్తూ కొబ్బరి కాయల్లో నెయ్యిపోశారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులతో పాటు బంధువులు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శిగా కృష్ణకుమారి

భీమడోలు: కాపు సంక్షేమ సేన మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శిగా మామిడి కృష్ణకుమారి ఆదివారం నియమితులయ్యారు. కాపు సంక్షేమ సేనా రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు చేగొండి హరిరామజోగయ్య ఆదేశాల మేరకు సూరప్పగూడెం పంచాయతీ పరిధిలోని పాతూరుకి చెందిన మామిడి కృష్ణకుమారిని నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షురాలు కళావతి నియమించినట్లు కృష్ణకుమారి ఆదివారం తెలిపారు. తనపై నమ్మకం ఉంచి అప్పగించిన పదవికి వన్నె తెచ్చేలా తన వంతు కృషి చేస్తానని ఆమె పేర్కొన్నారు.

136 మందికి కంటి పరీక్షలు



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య నిపుణులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక రామకోటి ప్రాంగణంలో ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. పరమహంస యోగానంద నేత్రవైద్యశాల వైద్యులు ఈశిబిరంలో పాల్గొని 136 మందికి కంటి పరీక్షలు చేశారు. 17 మందికి శస్త్రచికత్సలు అవసరమని గుర్తించి వారికి శస్త్రచికిత్సలు చేయడానికి ఏర్పాటు చేశారు. అలాగే 32 మందికి కళ్లజోళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మానేపల్లి రామారావు, బొలిశెట్టి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వాక్ విత్ అంబటి, కొఠారు

పెదపాడు: సత్రంపాడు నుంచి వట్లూరు సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల వరకు సోమవారం నిర్వహించే ‘వాక్ విత్ ఫార్మర్’ కార్యక్రమంలో క్రికెటర్ అంబటి రాయుడు, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి పాల్గొంటారని పెదపాడు ఎంపీడీవో ఎస్ సూర్యకుమార్ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు విజయవంతం చేయాలని పెదపాడు మండలంలోని వట్లూరు గ్రామ సచివాలయం 2 సమీపంలోని సత్రంపాడు నుంచి ఉదయం 9.30 గంటల నుంచి ప్రారంభమవుతుందని తెలిపారు. అనంతరం సీఆర్ఆర్ కళాశాల మైదానంలో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా క్రీడా పోటీలు ప్రారంభిస్తున్నట్లు చెప్పారు.

ఘనంగా జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు



ద్వారకాతిరుమల: దిశ చట్టంపై ఉపన్యసిస్తున్న ఉపాధ్యాయులు



టి.నరసాపురం: విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం



ధర్మాజీగూడెం: గ్రంథాలయ వారోత్సవాలలో పాల్గొన్న విద్యార్థులు

ద్వారకాతిరుమల: స్థానిక శాఖా గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా విద్యార్థులకు ఆదివారం దిశ చట్టంపై అవగాహన కల్పించారు. ముందుగా గ్రంథాలయ అధికారిణి గుర్రం బంగారు పాపతో కలసి గురుకుల పాఠశాల గ్రంథాలయ అధికారిణి సీహెచ్ వెరోనికా, ఎస్‌వీడీవీ స్కూల్ ఉపాధ్యాయుడు సీహెచ్ కాంతారావు, ద్వారకాతిరుమల సచివాలయం-2 మహిళా పోలీస్ లక్ష్మీ సుజన దివంగత మాజీ ప్రధానమంత్రి ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం మహిళా సాధికారత – దిశ చట్టంపై వారు ఉపన్యసించారు. చిన్నారులు, మహిళలపై లైంగిక వేధింపులు, అత్యాచారాలు, గృహ హింస వంటి దాడులు జరుగుతున్నాయని, వాటి నిర్మూలనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దిశ, నిర్భయ వంటి కఠినమైన చట్టాలను అమలుచేసి రక్షణ కల్పిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకురాలు బట్టు మణి, పాఠకులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం: స్థానిక శాఖా గ్రంథాలయంలో 56వ గ్రంథాలయ వారోత్సవాలు 6వ రోజు నిర్వహించారు. గ్రంథాలయాధికారి పి.దుర్గారావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో డాంగే నగర్ సచివాలయం మహిళా పోలీస్ ఎండీ నగ్మ దిశ చట్టం గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులకు లెమన్ అండ్ స్పూన్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ సేవలకు ఉమర్ ఆలీ, విద్యార్థులు పాల్గొన్నారు.

టి.నరసాపురం: స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయాధికారి ఆర్.కిషోర్ తెలిపారు. 6వ రోజు విద్యార్థులకు గ్రంథాలయాల ఆవశ్యకత, వాటిని సద్వినియోగం చేసుకునే విధానంపై వక్తలు వివరించారు. అనంతరం విద్యార్థులకు విజన్ స్కూల్ కరస్పాండెంట్ పురం శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆటల పోటీలు జరిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ నల్లూరి శ్రీనివాసరావు, విజన్ స్కూల్ ఉపాధ్యాయురాలు జి.వరలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

లింగపాలెం: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ధర్మాజీగూడెం శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు క్విజ్, బొమ్మలు, వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. 43 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. విద్యార్థుల్లో దాగిఉన్నా నైపుణ్యతను చాటుకునేందుకు ఈపోటీలు ఎంతగానో దోహదపడుతాయని వారు పేర్కొన్నారు. విజేతలకు ఈనెల 20 వతేదిన బహుమతులు అందజేస్తామని గ్రంథాలయాధికారి సీహెచ్‌వీ రమణ తెలిపారు.

నేడు తొండిపాకలో వై ఏపీ నీడ్స్ జగన్

కుక్కునూరు: తొండిపాక సచివాలయ పరిధిలో సోమవారం వై ఏపీ నీడ్స్ జగన్, గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కుచ్చర్లపాటి నరసింహరాజు తెలిపారు. ఈ కార్యక్రమాలలో పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పాల్గొంటారని చెప్పారు. వైఎస్సార్‌సీపీ అభిమానులు, కార్యకర్తలు, నాయకులు ,అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

రేపు ఉపాధి హామీ ప్రజావేదిక

లింగపాలెం: ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ ప్రజావేదిక మంగళవారం ఉదయం 10 గంటలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయం నందు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఎస్.ఆశీర్వాదం తెలిపారు. మండలంలోని 22 పంచాయతీల నివేదిక రిపోర్టును ప్రజావేదికలో ప్రవేశపెట్టనున్నట్లు ఆయన చెప్పారు. గ్రామాల ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని ఎంపీడీఓ కోరారు.

ఘనంగా హనుమద్ విగ్రహ ప్రారంభోత్సవం



రామానుజపురంలో ప్రారంభోత్సవం జరుపుకున్న హనుమాన్ విగ్రహం

కొయ్యలగూడెం: రామానుజపురంలో ఏర్పాటు చేసిన శ్రీ అభయ ఆంజనేయస్వామి విగ్రహ ప్రారంభోత్సవం ఆదివారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అర్చకులు మామిళ్ళపల్లి శివానందాచార్యుల పర్యవేక్షణలో ప్రత్యేక పూజలు చేశారు. రెండు రోజులపాటు హోమాలు నిర్వహించగా ఉదయం 9.43 గంటలకు 33 అడుగుల స్వామివారి భారీ విగ్రహాన్ని ప్రారంభోత్సవం చేశారు. మధ్యాహ్నం నుంచి సుమారు పదివేల మంది భక్తులకు అన్నసమారాధన చేశారు. ఈ కార్యక్రమానికి పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

జంగారెడ్డిగూడెంలో క్రికెట్ ఫీవర్



జంగారెడ్డిగూడెంలో ఏర్పాటు చేసిన భారీస్క్రీన్‌పై క్రికెట్ లైవ్ వీక్షిస్తున్న ఎమ్మెల్యే ఎలీజా తదితరులు

జంగారెడ్డిగూడెం: పట్టణంలో వరల్డ్‌కప్ క్రికెట్ ఫీవర్ కనిపించింది. ఆదివారం పట్టణంలో మధ్యాహ్న సమయం నుంచి ఎక్కువ మంది ప్రజలు టీవీలకు, సెల్‌ఫోన్‌లకు అతుక్కుపోయారు. అలాగే పట్టణంలో సిటీకేబుల్, పొట్లం యాప్‌ల సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో క్రికెట్ లైవ్ భారీ స్క్రీన్ ఏర్పాటు చేశారు. అధిక సంఖ్యలో క్రికెట్ అభిమానులు బిగ్ స్క్రీన్‌పై వీక్షించేందుకు జెడ్పీహైస్కూల్ గ్రౌండ్‌కు చేరుకున్నారు. చింతలపూడి ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా, వైఎస్సార్ సీపీ నాయకులు బత్తిన చిన్న, నూకాలమ్మ ఆలయ కమిటీ చైర్మన్ రాజాన సత్యనారాయణ తదితరులు బిగ్‌స్క్రీన్ లైవ్‌ను వీక్షించారు.

బుట్టాయగూడెంలో ఉచిత వైద్యశిబిరం



ఉచిత వైద్యశిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ప్రజలు

బుట్టాయగూడెం: స్థానిక విద్యారోహిణీ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో ఆదివారం రాధాస్వామి సత్సంగం వారి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో 9 రకాల వైద్య సేవలను అందించారు. స్త్రీల వైద్యం, చిన్నపిల్లలు, దంత వైద్యం, హోమియో వైద్యం, ఆక్యుపంక్చర్ జనరల్ మెడిసిన్, చర్మవ్యాధులు, ఈసీజీ, కంటి వ్యాధులకు సంబంధించి పరీక్షలు చేశారు. కార్యక్రమంలో రాధాస్వామి సత్సంగం ఆర్గనైజర్ రవికిరణ్, హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ సీఎంగా జగన్ రావాలి



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎంపీపీ, వైఎస్సార్ సీపీ నాయకులు

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని లక్కవరం సచివాలయం -2 పరిధిలో సచివాలయం కన్వీనర్ నిమ్మ శ్రీదేవి ఆధ్వర్యంలో ఆదివారం నువ్వే మా నమ్మకం జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీపీ కొదమ జ్యోతి, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు నిమ్మ గురునాథరెడ్డి పాల్గొని ప్రజల వద్దకు వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ కొదమ జ్యోతి మాట్లాడుతూ నవరత్నాల పథకాలతో ప్రతి కుటుంబంలో లబ్ధి చేకూరిందన్నారు. సంక్షేమం, అభివృద్ధి ఇలానే కొనసాగాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నిమ్మ రామకృష్ణ, సచివాలయం కన్వీనర్లు దల్లి నాగేశ్వరరావు, మల్లెల్లి సూర్యనారాయణ, గృహసారథి ఆళ్ల వెంకట సత్యనారాయణ, వలంటీర్ మౌనిక పాల్గొన్నారు.

నేడు గురవాయిగూడెంలో వై ఏపీ నీడ్స్ జగన్

లక్కవరంలో సోమవారం సాయంత్రం 4 గంటల నుంచి వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వామిశెట్టి హరిబాబు తెలిపారు. ఎంపీపీ, జెడ్పీటీసీలు పాల్గొని గ్రామంలో పర్యటిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని హరిబాబు కోరారు.

రంగప్రసాద్‌కి తెలుగు వెలుగు జాతీయ పురస్కారం



జాతీయ పురస్కారానికి ఎంపికైన వెంకట శేష రంగప్రసాద్ ఆచార్యులు

జంగారెడ్డిగూడెం రూరల్: గురవాయిగూడెం శ్రీ మద్ది ఆంజనేయ స్వామివారి ఆలయ ఆస్థానాచార్యులు వేదాంతం వెంకట శేష రంగప్రసాద్ ఆచార్యులు తెలుగు వెలుగు విశిష్ట కళా ప్రపూర్ణ జాతీయ పురస్కారానికి ఎంపికయ్యారు. రంగ ప్రసాద్ జోతిష్యం, వాస్తు శాస్త్రాలలో చేసిన విశిష్ట కృషికి గాను ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు తెలుగు వెలుగు సాహితీ వేదిక జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక చైర్మన్ పోలోజు రాజ్‌కుమార్ ఆచార్యులు, జాతీయ కన్వీనర్లు డాక్టర్ రంగిశెట్టి రమేష్, డాక్టర్ వలబోజు మోహన్‌రావు ఆదివారం తెలిపారు. విజయవాడ బాలోత్సవ భవన్‌లో డిసెంబర్ 10వ తేదీన జరిగే కార్యక్రమంలో ముఖ్య అతిథుల చేతుల మీదుగా జాతీయ పురస్కారాన్ని అందజేయనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా రంగ ప్రసాద్‌కు దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు, అర్చకులు, వేద పండితులు, దేవస్థానం సిబ్బంది, పురోహితులు అభినందనలు తెలిపారు.

శాలివాహనుల కార్తీక వనసమారాధన



శాలివాహనుల కార్తీక వనసమారాధనలో పాల్గొన్న మహిళలు, చిన్నారులు

కొయ్యలగూడెం: కార్తీక మాసం మొదటి ఆదివారం సందర్భంగా కార్తీక సమారాధన కార్యక్రమాలు పలుచోట్ల నిర్వహించారు. కొయ్యలగూడెం శివారులో శాలివాహన ప్రజాపతి కుమ్మర్ల సంఘం ఆధ్వర్యంలో కార్తీకవన సమారాధన కార్యక్రమం ఆహ్లాదంగా జరిగింది. ఈ సందర్భంగా మహిళలు, చిన్నారులు పలు సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొని బహుమతులు అందుకున్నారు. కన్నాపురం, నరసన్నపాలెం, రాజవరం గ్రామాల సమీపాలలో వనసమారాధన కార్యక్రమాలు నిర్వహించారు. మండల సంఘ అధ్యక్షుడు పసివేదల తాతారావు, పట్టణ అధ్యక్షుడు బొలిశెట్టి సత్యనారాయణ, కార్యదర్శి మల్లవరపు శ్రీనివాస్, గొలిశెట్టి శ్రీనివాస్ పర్యవేక్షించారు.

సమాజానికి మేలు చేసే కవితలు రచించాలి



రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్ పిల్లంగోళ్ళ శ్రీలక్ష్మిని సన్మానిస్తున్న శ్రీశ్రీ కళావేదిక ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): కవులు సమాజానికి మేలు చేసే విధంగా ఉత్తమ కవితలు రచనలు చేయాలని, సమాజంలోని పరిస్థితులపై పూర్తి అవగాహనతో ఉండాలని, అక్షరాన్ని ఆయుధంగా మార్చుకొని మంచి రచనలు చేయాలని రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్ పిల్లంగోళ్ళ శ్రీలక్ష్మి పిలుపునిచ్చారు. ఆదివారం విజయవాడ మాకినేని పున్నయ్య భవనంలో జరిగిన శ్రీశ్రీ కళావేదిక 125వ శతాధిక కవి సమ్మేళన కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఇందుకు సంబంధించిన వివరాలను శ్రీశ్రీ కళావేదిక ప్రతినిధులు ఏలూరులో పత్రికలకు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీలక్ష్మి మాట్లాడుతూ కవులను ప్రోత్సహించే విధంగా ఎన్నో కవి సమ్మేళనాలు నిర్వహిస్తూ ఎన్నో అవార్డులను, పురస్కారాలను అందుకున్న శ్రీశ్రీ కళా వేదిక అంతర్జాతీయ చైర్మన్ కత్తి మండ ప్రతాప్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ఇటువంటి సమ్మేళనాల ద్వారా తమ సాహిత్య ప్రతిభను మెరుగులు దిద్దుకునే అవకాశం వర్ధమాన కవులకు కలుగుతుందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కవులకు, కళాకారులకు పెద్దపీట వేస్తూ వైఎస్సార్ జయంతి సందర్భంగా ప్రతి ఏటా వైఎస్సార్ లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డు ద్వారా రూ. పది లక్షల నగదు ఇస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా పిల్లంగోళ్ళ శ్రీలక్ష్మిని శ్రీశ్రీ కళావేదిక ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధికార భాషా సంఘం అధ్యక్షుడు విజయబాబు, బోయి భీమన్న అవార్డు గ్రహీత శ్రీ శ్రీ కళావేదిక చైర్మన్ కత్తిమండ ప్రతాప్, జాతీయ అధ్యక్షురాలు కొల్లి రమావతి ఈశ్వరి, వివిధ రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున కవులు కళాకారులు పాల్గొన్నారు.

మహిళల భద్రత కోసమే ‘దిశ’ యాప్



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న దిశ ఎస్సై కాంతిప్రియ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): మహిళల భద్రత కోసమే దిశ చట్టం అమలులో ఉన్నదని, కాబట్టి విద్యార్థినులు, మహిళలు దిశ యాప్‌ను తమ మొబైల్ ఫోనుల్లో తప్పనిసరిగా డౌన్‌లోడ్ చేసుకోవాలని ఏలూరు నగర దిశ చట్టం ఎస్సై వి.కాంతిప్రియ చెప్పారు. 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఆదివారం సెయింట్ ఆన్స్ కళాశాల, సెయింట్ థెరిస్సా జూనియర్ కళాశాల విద్యార్థినులకు దిశ చట్టం మహిళా సాధికారతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎస్సై కాంతిప్రియ మాట్లాడుతూ దిశ చట్టంలోని సెక్షన్‌లను విద్యార్థులకు వివరించారు. విద్యార్థినిలకు ఏ అవసరం వచ్చిన ముందుగా 100 డయల్ చేస్తారని, ఇప్పుడు 112కు కూడా డయల్ చేయవచ్చు అని చెప్పారు. మహిళల రక్షణ కోసం 1100 నంబర్‌కు డయల్ చేస్తే ప్రభుత్వం రాత్రి 11 గంటలు దాటిన తర్వాత నుంచి ఉదయం 5 గంటల వరకు ఒక మహిళ కానిస్టేబుల్‌ను, ఒక పురుష కానిస్టేబుల్‌ను ఇచ్చి వాహనంలో వారి ఇంటి వద్ద దిగబెట్టే సదుపాయం కల్పిస్తుందన్నారు. అపరిచిత వ్యక్తులతో స్నేహం చేయవద్దని, బాగా చదువుకుని బంగారు భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలని విద్యార్థినులకు సూచించారు. అనంతరం విద్యార్థులకు జనరల్ నాలెడ్జ్‌పై క్విజ్ పోటీలు నిర్వహించారు. దిశ చట్టంపై విద్యార్థులకు వ్యాస రచన పోటీలు జరిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉపాధ్యాయురాలు జీ నీలిమ, డీ శ్రీవల్లి, చలసాని సురేంద్ర, డిప్యూటీ లైబ్రేరియన్ ఏ.నారాయణరావు, అసిస్టెంట్ లైబ్రేరియన్ వీటీ సందీప్ కుమార్, బీ.రమేష్, ఎండీ. అస్లామ్ పాషా, కే.నాగరోజా మణి, బీవీ లక్ష్మి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

హిందూ ఆలయాలను కుటుంబాలతో సహా దర్శించండి



హిందూ సమ్మేళనంలో ప్రసంగిస్తున్న భువనేశ్వరి పీఠం స్వామీజీ శ్రీకమలానంద భారతీ జీ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఇటీవల కాలంలో హిందువులు హిందూ దేవాలయాలకు కుటుంబాలతో వెళ్లడం లేదని, రానురాను హిందువుల్లో ఐకమత్యం సన్నగిల్లుతున్న నేపథ్యంలో హిందువులు కుటుంబ సభ్యులతో సహా ఆలయాలను దర్శించాలని భువనేశ్వరి పీఠం స్వామీజీ శ్రీ కమలానంద భారతి జీ పిలుపునిచ్చారు. సమరసతా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక గీతామందిర్‌లో ఆదివారం హిందూ సమ్మేళనం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న స్వామీజీ మాట్లాడుతూ హిందువులను ఏకం చేయడం కోసమే రాష్ట్ర వ్యాప్తంగా సమరసతా సేవా ఫౌండేషన్ వారు సమ్మేళనాలు నిర్వహించడం ఆహ్వానించదగ్గ పరిణామమన్నారు. మతమార్పిడిలను నిరోధించడమే ఈ ఫౌండేషన్ ముఖ్య ఉద్దేశ్యమని, హిందువులలో భక్తి భావాలను పెంపొందించి తిరిగి స్వధర్మం ఆచరించాలని స్వామీజీ సూచించారు. తొలుత నగరవీధుల్లో 200 మందితో నగర సంకీర్తనలతో శోభాయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హిందూ ధర్మరక్షా సమితి రాష్ట్ర కార్యదర్శి కేఎస్ఎస్ సుబ్రహ్మణ్యం, సమరసతా సేవా ఫౌండేషన్ జిల్లా సహ కన్వీనర్ ధనెంకుల గోపాలకృష్ణ, నగర కన్వీనర్ ప్రసాద్, దేవాలయాల కన్వీనర్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

దాడి ఘటనలో వ్యక్తికి గాయాలు

జంగారెడ్డిగూడెం: గంజాయి విక్రయిస్తుండగా చూసిన వ్యక్తిపై దాడి చేసి గాయపరిచిన ఘటన చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని వేగవరం గ్రామానికి చెందిన ఎస్.నాగరాజు గ్రామంలో ఆదివారం సాయంత్రం తూంపాటి చినరాజు అనే వ్యక్తి గంజాయి అమ్ముతుండగా చూశాడు. ఇదేంటి గంజాయి అమ్ముతున్నావు.. ఇది నేరం కదా అని ప్రశ్నించాడు. దీంతో చినరాజు నాగరాజుపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చాడు. సమీపంలో ఉన్న వ్యక్తులు ఇది గమనించి వెళ్లేసరికి చినరాజు పారిపోయాడు. తీవ్రంగా గాయపడిన నాగరాజును స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. అతనికి చేయి విరగడంతో అతని బంధువులు, కుటుంబసభ్యులు పట్టణంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

బీటీఏ నూతన కార్యవర్గం ఎన్నిక

ఏలూరు (ఆర్ఆర్‌పేట): బహుజన టీచర్స్ అసోసియేషన్ (బీటీఏ) ఏలూరు జిల్లా నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. తొలుత స్థానిక అంబికా థియేటర్ వద్దనున్న కృప వెల్‌నెస్ సెంటర్‌లో బీటీఏ జిల్లా కౌన్సిల్ నిర్వహించారు. బీటీఏ జిల్లా అధ్యక్షుడు సాయిరాజు భల్లం అధ్యక్షత వహించారు. ఈ సమావేశానికి బీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు బీ.మనోజ్ కుమార్, డిప్యూటీ జనరల్ సెక్రటరీ పీ.సాల్మన్ హాజరై రాష్ట్రంలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను వివరించారు. అనంతరం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఏలూరు జిల్లా నూతన కార్యవర్గ అధ్యక్షుడిగా గుడిమెల్లి వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా చేడే ధర్మలింగం, కోశాధికారిగా గుండె వెంకటరమణ, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఖండవల్లి గిరిబాబు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బర్మావతు రాంబాబు, డిప్యూటీ జనరల్ సెక్రటరీగా కాటంరాజు, అడిషనల్ జనరల్ సెక్రటరీగా వుండి కృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా బొల్లిపో కృపాకరణ్,ఆడిట్ సెక్రటరీగా అలుగుల సాయిరాజు, ప్రచార కార్యదర్శిగా పోలిమెట్ల శ్రీనివాసరావు, మహిళా కార్యదర్శులుగా వాసే ధనకాంత, బి.వరలక్ష్మి, కే లోవకుమారి, గౌరవాధ్యక్షులుగా ఎం .ఆనందరాజు, డి.శ్రీనివాస్, కేడీ సమర్పణరావు, రాష్ట్ర కౌన్సిలర్లుగా పీ.సాల్మన్, బీ మనోజ్‌కుమార్, బీ రామారావు, బీహెచ్‌పీ సాయిరాజు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా మనోజ్‌కుమార్, ఎన్నికల పరిశీలకులుగా సాల్మన్ వ్యవహరించారు.

జనవరి 5 నుంచి అంతర్జాతీయ తెలుగు మహాసభలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): వచ్చే ఏడాది జనవరి 5వ తేదీ నుంచి అంతర్జాతీయ తెలుగు మహాసభలు నిర్వహించనున్నట్లు ప్రముఖ గజల్ కళాకారుడు గజల్ శ్రీనివాస్ తెలిపారు. ఆంధ్ర సారస్వత పరిషత్ సంఘం ఆధ్వర్యంలో 2వ అంతర్జాతీయ తెలుగు మహా సభలకు సన్నాహక సమావేశాన్ని ఆదివారం స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మాస్ట్రో గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ రాజరాజ నరేంద్రునికి, నన్నయ్యకు అంకితంగా రాజమహేంద్రవరంలో వచ్చే జనవరి 5, 6, 7, తేదీల్లో 2వ అంతర్జాతీయ తెలుగు మహాసభలను నిర్వహించడానికి నిర్ణయించామన్నారు. తెలుగు భాషను రాబోయే తరాల్లో తల్లి ఒడి భాషగా నిలిపే లక్ష్యంగా, ఆంధ్రమేవ జయతే అని ప్రపంచ వ్యాప్తంగా చాటి చెప్పేందుకు ఈ ప్రపంచ తెలుగు మహా సభలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన మార్గాని శ్రీకాంత్ మాట్లాడుతూ తెలుగు తల్లి పండుగగా జరిగే ఈ మహాసభల్లో కవులు, కళాకారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు అందరూ పాల్గొనాలని కోరారు. మూడవ పట్టణ సీఐ కె.శివాజీ మాట్లాడుతూ తెలుగు భాష మాతృభాష మాత్రమే కాదని, అమృత భాష అని అన్నారు. తెలుగు మహాసభల సన్నాహాలకు నియోజకవర్గస్థాయిలో కమిటీలు ఏర్పాటు చేశారు. ఏలూరు నియోజకవర్గానికి మార్గాని నాగ శ్రీకాంత్‌ను కన్వీనర్‌గా, నాగా, పీ.వెంకటేశ్వరావులను కో-కన్వీనర్‌లుగా, కస్తూరీ రావు, టి.గిరిరాజ్, వై.ఆనంద నాయుడు, కె.శ్రీనివాసరావు, సీహెచ్ సురేందర్, రమణ, మానేపల్లి రామారావులను సభ్యులుగా నియమించి నియామక పత్రాలు అందజేశారు.